# జమీన్

'మేయ్! నీకే జెప్పేది. రొట్టా గిట్టా యేం బళ్లా. టైము ల్యా' అన్నాడు హుసేన్ – టెరికాటన్ లాల్చీలో తల దూరస్తా.

బియ్యప్పిండిలో ఎఱ్రగెడ్డలు తరిగి అంతసేపూ గబగబా రొట్టె కాల్చిన రిహానా భర్త వైపు అయోమయంగా చూసింది. అతడి పెడగ్రానికి ఒళ్లు మండకొస్తావుంటే దబర్లో చేతులు కడుక్కుంటా పొయ్యి కాణ్ణుంచి లేచింది.

'యీ మనిషికి యేమి జెప్పగలం? యెట్టా చోబాపూరీల బుట్ట తీసక బోతున్నాడు గదా... దాన్లోనే నాలుగు రొట్టెముక్కలు పెట్టుకునేదానికి ఒళ్లు బరువా? దార్లో ఆకలెయ్యదా?'... ఆ మాటలు నేరుగా భర్తతో అన్లేక కొడుకువైపు చూస్తా అంది.

కొడుకు తలెత్తనేలా. వాకిలితట్టు తిరిగి పొళ్లు తోముకుంటూ కూర్చున్నాడు. దొడ్లో బాసన్లు కడుగుతున్న కోడలు అసలికా మాటలు యిననట్టే నటించింది.

వాళ్లిద్దరికీ హుసేన్‌కు బదులు చెప్పే దెయిర్యంలా. ఆ మాటకొస్తే అన్నేళ్లు కాపరం జేసిన రిహానాగ్గూడాలా.

అందుకే యింకే మాట మాట్లాడేక గమ్మునయ్యి భర్తవైపు చూసిందామె.

హుసేన్ జవాబివ్వలా.

చెక్క బీరువా అద్దంలో గుడ్డలొకసారి సరిచూసుకొని యింక పొయ్యొస్తా నన్నట్టు భార్యవైపు చూశాడు.

రిహానా వంట గదికాణ్ణే నిల్చొని చూస్తా ఉంది. రొట్టె పెట్టకపొమ్మని చెప్పాలని ఆమె ప్రాణాలు లాగతా వున్నాయి. చెబితే క్యాకలెయ్యబోతాడేమోనని బెరుగ్గా కూడా వుంది. యింకో తడవప్పుడైతే హుసేన్ లెక్కజేసేవాడు కాదుగాని మంచి పనికి కదిలేప్పుడు ఆమె మనసు కష్టబెట్టడం దేనికిలే అనిపించింది. రిహానా మొకం పెట్టిన తీరు జూసి అతడికి సన్నంగా నవ్వొచ్చింది.

'మేయ్! ఏందా మక్కట్లా... మొకం చిన్నంగా పెట్టుకొనా... రొట్టెలిద్దే పెట్టుకుంటా' అన్నాడు పెదాలు దాటని నవ్వుతో.

రిహానా మొకం వెలిగింది. అంత మాటే చాలన్నట్టు గబుక్కున రొట్టెల్ని మూటగట్టి అతడి చేతిలోని వైరుబుట్టలో కుక్కింది.

'జాగ్రత్తగా బోయిరా. బ్రమ్మయ్యనీ సీతమ్మొదిన్నీ అడిగినట్టు చెప్పు. జాగా వొకటికి రెండుసార్లు బేరం ఆడకుండా వుండబాకా' అంది వెనకనే నడస్తా.

హుసేన్ తలూపి యీదిలోకి నడిచాడు.

అప్పటికే బండికి టైమైపోయింది. పాసింజరు బయల్దేరి పోద్దేమోననే గాబరాతో నడకలో వేగం పెంచాడు. కొత్త లుంగీని వొరుసుకుంటా వడివడిగా పడుతుండాయి అడుగులు.

స్టేషనుకు చేరుకునే సరికి రైలు అప్పుణ్ణే వచ్చి ఆగింది. చీరాల నుంచి అది కావలి చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంటవద్ది. సిగ్నెళ్లు పడకపోతే యింక చెప్పేదానికేలా.

ప్లాట్‌ఫారమ్ మీద రైలు చూసి గబగబా టికెట్టు కొనుక్కొని ఎక్కి కూర్చున్నాడు. వొళ్లో చోబాపూరీల బుట్ట సర్దుకున్నాక స్థిమితపడినాడు యింకీ రైలు ఎప్పుడైనా పోనీ అన్నట్టు.

ఇంటి జాగా కొనడానికి కావలి పోతున్నాడన్న ఆలోచన కంటే స్నేయితుడైన బ్రమ్మయ్యను చాన్నాళ్ల తర్వాత కలవబోతున్నందుకే అతడికి ఎక్కువ సంతోషంగా వుంది. నాలుగేళ్లయ్యింది అతడు కావలిపోయి. అదిగూడా బ్రహ్మయ్య కూతురి పెళ్లికి. పెళ్లి అడావిడిలో బ్రమ్మయ్యతో సరిగ్గా మాట్లాడిందీ లా అందర్నీ కలిసిందీ

లా. భోజనాలు జరిగిన ఆ కాసేపుండి బాధనిపిస్తున్నా వచ్చేశాడు.

మళ్లీ యిన్నాళ్లకు వీలుబడింది కావలి ప్రయాణం!

బ్రమ్మయ్యా హుసేనూ కావిల్లోనే పుట్టి పెరిగారు. జెడ్పీ హైస్కూల్లో కలిసి చదువుకున్నారు.

బ్రమ్మయ్యది మాలపాళెమైతే హుసేన్‌ది కసాబ్‌గల్లీ. యివి రెండు పక్క పక్కంగా వున్నందుకో ఏమో వీళ్ల చిన్నతనంలో దినమూ వాటి మధ్య పగ రగలతా వుండేది.

సాయిబుల పిల్లని మాలపాళెం కుర్రాడు కదలేశాడని ఒకరోజు తలకాయలు పగిలేవి. మాలపాళెం కుర్రాణ్ణి సాయిబుల పిల్లోడు కలేశాడని మరోరోజు రక్తం పారేది. పనీపాటా ఉజ్జోగం సజ్జోగం లేని నాయాళ్లకంతా అప్పట్లో యీ రెండీదుల్లో గలాటాలే బతుకు. తన్నులాటకు సత్తవొస్తుందనీ కొందరైతే గాడిద నెత్తురుతాగి దాన్ని అరాయించుకునేదానికి లగెత్తేవాళ్లు.

యిళ్లిట్టా కొట్టక సస్తున్నా యీ గలాటాలేవీ బ్రమ్మయ్యా హుసేన్‌ల స్నేహానికి అడ్డం కాలా.

హుసేన్ వాళ్లమ్మ పొద్దుగూకులా 'మాల నాబట్టలతో తిరగబాకరా' అని కొడుకుని కట్టడి చేస్తా వున్నా యిళ్లిద్దరూ కలిసి స్కూలవతల బావిలో హాయిగా యీతగొడతా గడిపేసేవాళ్లు. యింక తాళ్లపాళెం తాటితోపుల్లో కల్లుకి బలాదూరు తిరుగుళ్లకయితే అంతూ పొంతూలా. సాయంత్రమైతే బ్రమ్మయ్య పుస్తకాలెత్తుకొని హుసేన్ యింటికి వచ్చేవాడు. బ్రమ్మయ్యింట్లో బుడ్డిదీపం వుండేది. హుసేన్ యింట్లో బల్బు వెలిగేది. హుసేన్ వాళ్లమ్మ బ్రమ్మయ్యని చూసి సణుక్కుంటూ వున్నా యిద్దరూ బల్బు కిందే చదువుకునేవాళ్లు.

బ్రమ్మయ్య వాళ్ల నాయిన యేం పనిచేసేవాడో హుసేన్‌కు గుర్తులేదుగాని హుసేన్ వాళ్ల నాయిన యేం పని చేసేవాడో బ్రమ్మయ్యకు యిప్పటికీ గుర్తే.

మావుసం కొట్టడం!

నీళ్లలో ముంచి తీసిన తొడపక్కని హుసేన్ నాయిన కచ్‌కచ్‌మని ముక్కలు కొడతా వుంటే కళ్లు యింతింత చేసుకుని చూసేవాడు బ్రమ్మయ్య. ఆ కత్తి కోసమే ప్రాణాలు యిడిచేస్తానన్నట్టుండేది అతడి చూపు. హుసేన్ నాయిన హుసేన్ మీద కొట్టు వొదిలేసి పోతే మావుసం కొట్టే ఖాళీ మొద్దు మీద కత్తితో దెబ్బలేసి ముచ్చట తీర్చుకునేవాడు.

ఒకరోజు హుసేన్ నాయిన మావుసం కొడతా కొడతానే మొద్దు మీదకు వాలి ప్రాణం వొదిలాడు. గుండెపోటుతో పొయ్యుంటాడని యాదిలో వాళ్లు అనుకున్నారు. తాగుడు వల్ల పొయ్యాడని తోటి కసాబులు చెప్పుకున్నారు.

కడుపునిండా తిండున్నా ల్యాకపోయినా నవ్వుమొకాలతో కళకళలాడతా వుండిన హుసేన్ యిల్లు వాళ్ల నాయిన చావుతో పాడుబడింది. హుసేన్ వాళ్లమ్మ వెర్రిచూపులు చూస్తా మంచానికి అతక్కబోయింది.

ఆ కష్టంలో హుసేన్‌ని కడుపులో పెట్టి కాచుకుంది బ్రహ్మయ్య తల్లి రావమ్మ. మూడుపూటలా తిండి పెట్టి చిరుతిళ్లకు డబ్బులిచ్చి నాలుగు దెయిర్యం మాటలు చెప్పి బ్రమ్మయ్యకన్నా ఎక్కువగా చూసుకుందా పుణ్యాత్మురాలు.

బ్రహ్మయ్యయితే హుసేన్‌కు దిగులు తెలియకుండా నీడలా అంటి పెట్టుకోనుండేవాడు.

కొన్నాళ్లకు చీరాల నుంచి హుసేన్ చిన్నాయిన దిగబడ్డాడు. అతడిది గుడ్డల్యాపారం. పంచెలు దుప్పట్లు మూటగట్టుకొని వూరూరా తిరిగి అమ్ముకుంటా చాన్నాళ్లుగా చీరాల్లోనే తంటాలు పడుతావున్నాడు. తన సంసారం సాకడానికే అతడికి దేవుడు కనిపిస్తావున్నాడు. యింక వొదిన్నీ హుసేన్నీ అంటే తలకు మించిన బారమే. అయినా వొదిన దుస్థితి చూళ్లేక వాళ్లిద్దర్నీ చీరాల బయల్దేరదీశాడు.

యీ సంగతి తెలిసి బొబ్బరింతలతో ఏడుపు మొదలెట్టాడు హుసేన్. కసాబ్‌గల్లీని బ్రమ్మయ్యనీ వొదిలిరానని కాళ్లాయేళ్లా బడ్డాడు. చివరికి వాణ్ణి తాళ్లతో కట్టి బస్సులో కుదేయాల్సొచ్చింది చిన్నాయినకు. బస్సు కదలతా వుంటే వెక్కిళ్లు పెడతా హుసేన్‌కు వీడ్కోలు చెప్పాడు బ్రమ్మయ్య.

చీరాలబోయాక హుసేన్ చదువు చట్టుబండలయ్యింది. తల్లి కోసం చిన్నాయిన కోసం రకరకాల పనులు చేశాడు. వెల్డింగుపనీ కరెంటు పనీ.... కొన్నాళ్లు గుడ్డల మూటెత్తుకొని చిన్నాయిన వెంట వూళ్లు తిరిగాడు. యింకొన్నాళ్లు మార్కెట్లో మావుసం కొట్టాడు. కడాకు మెకానిక్కు పనిలో కుదిరిపోయాడు.

యాడున్నా యేమి చేస్తున్నా అతడు బ్రమ్మయ్య స్నేహాన్ని మాత్రం వొదులుకోలా. జాబులేస్తానే ఉండేవాడు. చదువులో కొత్త స్నేయితులు ఎదురైనా బ్రమ్మయ్య మనసులో కూడా హుసేన్ చోటు రొంత గూడా మూసుకుబోలా.

బియ్యే చేశాక గార్డుద్యోగం వొచ్చినప్పుడు బ్రమ్మయ్య అదేపనిగా చీరాలబోయి గూడ్సుబండిలో హైదరాబాద్‌కు వెంటబెట్టుకెళ్లాడు హుసేన్‌ని. ఆ

ఎన్నెల రాత్రి గార్డు పెట్టె ప్రయాణంలో మందు ముందుర పెట్టుకొని వాళ్లిద్దరూ చిన్ననాటి జ్ఞాపకాలు తవ్వుకుంటా వుంటే రైలు కూడా చప్పుడు చేయడం మాని వాళ్ల మాటలు వినింది.

హుసేన్ రిహానాను చేసుకొని చీరాల్లోనే వుండిపోతే బ్రమ్మయ్య సీతమ్మను చేసుకొని ట్రాన్స్ఫర్లతో వూరూరా తిరిగి చివరకు కావలికే వొచ్చిపడ్డాడు. వాలెంటరీ రిటైర్మెంటు తీసుకున్నాక వొచ్చిన డబ్బునీ అంతదాకా దాచుకున్నదాన్నీ కూడేసి కావలికానుకునే వున్న సత్రంలో యిల్లు కట్టుకున్నాడు. కలిగిన సంబంధం చూసి కూతురి పెళ్లి చేశాడు. యింక మిగిలింది కొడుకు రవణ! వాడు ఉద్యోగం చేస్తున్నాడనో వెతుక్కుంటున్నాడనో ఒకసారి హుసేన్‌కు బ్రమ్మయ్య జాబు రాసినట్టు గుర్తు.

బ్రమ్మయ్య కావిల్లో సెటిలయ్యేదాకా పట్టించుకోలేదుగానీ అతడు యిల్లు కట్టుకున్నప్పట్నించి హుసేన్ ప్రాణాలు కావలి తట్టే పీకుతా వున్నాయి. ఎన్నేళ్లగానో అతడి లోపల్లోపల వుండిపోయిన కోరిక బయటికొచ్చింది. ఏనాటికైనా కావిల్లో యిల్లు కట్టుకొని వుండిపోవాలని అతడు తరచూ భార్యకు చెప్తా వుండిన మాటలు యీసారి చేతల్లో పెట్టాడు.

కొడుకు చేతికందొచ్చాక గీరి గీకి దాచిపెట్టిన డబ్బుని వాడి కట్నంలో ముందే పక్కనబెట్టిన మొత్తాన్ని బయటకు తీశాడు. జాగాకు అవసరం అయితే అయిదు వేలో పదివేలో అప్పు చేద్దాం అని నిశ్చయించుకున్నాడు.

హుసేన్ కొడుక్కి కావలి రావడం యిష్టం లా. అతడికి చీరాల్లోనే బాగుంది. పైగా అతడికి పిల్లనిచ్చిన మావదీ చీరాలే.

'మేం యీణ్ణే వుంటాం. మీరు కావలి బోవాలనుకుంటే పోండి. అప్పుడప్పుడు వచ్చిపోతా వుండొచ్చు' అన్నాడు కొడుకు.

ఆ మాట అన్నదే తడవు యాడైనా రొంత జాగా చూడమని బ్రమ్మయ్యకు జాబుల మీద జాబులు రాశాడు హుసేన్. యింత స్థలం ముక్క దొరికితే గుడిసో రేకుల వసారో వేసుకొని దువా చేసుకుంటా పుట్టినూర్లో ప్రశాంతంగా గడిపెయ్యాలని అతడి ఆశ. హుసేన్ తొందరకు తగ్గట్టే బ్రమ్మయ్య కూడా తాత్సారం చేయకుండా చివరకు శుభవార్త రాశాడు 'స్థలం చూశా...రా' అని.

ఆ కార్డు చూసి పసిపిల్లాడిలా సంబరపడ్డాడు హుసేన్. యిన్నాళ్లూ నమాజు చేసినందుకు ఫలితం దక్కిందనుకున్నాడు.

'చోబాపూరీలుమా. నిన్నంతా కొబ్బరి తురిమి రిహానా చేసింది. బ్రమ్మయ్యకు యిష్టం కదా' అని లోపలికి రాబోతుంటే వరండాలో కూర్చుని వున్న రవణ హుసేన్‌ని చూసి చివాలున లేచాడు.

ఒక మాటలా.

ఒక నవ్వులా.

దుమదుమలాడతా బయటికెళ్లిపోయాడు.

హుసేన్ విచిత్రపోయి చూస్తుండిపోయాడతన్ని.

'మన రవణ గదా. ఏందట్ట మనిషిని పలకరించకుండానే పోతున్నాడు' అన్నాడు తేరుకుంటా.

సీతమ్మ ఏదో చెప్పబోతుంటే బ్రమ్మయ్య సర్దాడు.

'ఆ ముండనాయలితో రోజూ వుండేదేలా. నూ పా' అన్నాడు యింట్లోకి నడస్తా.

భోజనం చేయమన్నా ఆకలి లేదని బ్రమ్మయ్యతో కబుర్లలో పడ్డాడు హుసేన్. ఆ మాటా ఈ మాటాలోనే సాయంత్రమైపోయింది.

టీలు తాగాక స్నేయితులిద్దరూ స్థలం చూడ్డానికి బయలుదేరినారు. సత్రంకు యీ పక్క బ్రమ్మయ్య యిల్లుంటే ఆ పక్క స్థలం వుంది. చిన్న స్థలం. ఆరంకణాలు. చుట్టూ పచ్చటి సీవసింతచెట్లూ రొంత దాటాక చిల్లచెట్లు వున్నాయి.

'టౌన్లో రేట్లు పెచ్చున్నాయి హుసేనా. నూ మోటుకోలేవు. యీడ రేటు తక్కవ. పైగా నాకాణ్ణే వుంటావు గదా' అన్నాడు బ్రమ్మయ్య స్థలంలోకి నడస్తా.

స్థలం మీద నుంచి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు హుసేన్. ఎన్నాళ్ళ కలో ఎన్నాళ్ళ కోరికో అతడి కళ్లలో పల్చటి చెమ్మ పుట్టింది.

'ఎంతవద్దిరా. కొనగలనంటావా?' అన్నాడు రొంత ఆదుర్దాగా.

'ఆ దిగులే బళ్లా. ఓనరు మంచోడు. ఎంతిచ్చినా అదే పదివేలని తీసుకుంటాడు' అన్నాడు బ్రమ్మయ్య.

'అయితే పా. మాట్లాడదాం' అన్నాడు హుసేన్ యింకెందుకు ఆలస్యం అన్నట్టు.

'యాడికా? ఓనర్లం మనమే గదా' అని పెద్దగా నవ్వతా హుసేన్ భుజం

చరిచాడు బ్రమ్మయ్య.

హుసేన్ ఆశ్చర్యబోయాడు. వెంటనే అతడి మనసు స్నేహితుడి పట్ల కృతజ్ఞతతో ఉప్పొంగింది. గట్టిగా కావలించుకున్నాడు బ్రమ్మయ్యని.

'నీకు స్థలం కూడా వుందని చెప్పనే లేదేమిరా' అన్నాడు తనూ నవ్వుతా.

ఆకాశం మీద సన్నటి రేకలా వుదయించాడు చంద్రుడు. అమాశ రాబోతా వుందో వున్నమి మొదలయ్యిందో తెలీకుండా వుంది చంద్రుణ్ణి చూస్తే. చేల మీద నుంచి తెరలు తెరలుగా గాలి వీస్తా వుంది. ఉండుండి యాడో కుక్కలు మొరగతా వున్నాయి. వంట గదిలో సీతమ్మ కూర యేంచి పెడతా వుంటే పైన స్నేయితులిద్దరూ మందు మొదలెట్టినారు.

మాటలు దొర్లతా వున్నాయేగాని వాటిలో మనుపటి హుషారులా. ఇద్దరిలోనూ ఏవో ఆలోచనలు ఉన్నట్టుండాయి. మాట్లాడతానే మధ్యలో గమ్మునయిపోతా వున్నారు.

కాసేపు తాలినాక – తేవాలనుకుంటున్న ప్రస్తావన తెచ్చేశాడు హుసేను.

'నీ కొడుకేడ్రా? పత్తా లేకుండా పోయాడు' అని నెమ్మదిగా బ్రమ్మయ్యని కదలేశాడు.

రవణ ప్రవర్తన మధ్యాన్నం నుంచి హుసేన్ మనసుని గుచ్చతానే వుంది. చిన్నప్పుడు ఎత్తుకొని ఆడిస్తే కేరింతలు కొట్టిన రవణ... వచ్చినప్పుడల్లా 'హుసేను మావయ్యా' అంటా కాళ్లను చుట్టేసుకునే రవణ అలా అయిష్టం చూపించడం అతణ్ణి మెలిపెడతా వుంది.

కొడుకు ప్రస్తావన రాంగానే మొకం వేలాడేశాడు బ్రమ్మయ్య. అతడికి తెలుసు హుసేన్ అడగతాడని.

'మద్యానం చూశావుగా వాడి దరువా. ఆ మిడియాలం... పొగరుబోత్తనం... వాడేమీ చేతికందేట్టు లేడ్రా... వాడితో వూరేగడం యింక నా వల్లగాదు' అన్నాడు బాధగా.

కాసేపు తాలి 'ఎంతమందిమో చెప్పి చూశాం. అలివిగావడంలా. పెళ్లి చేసుకోమంటే చేసుకోడు. ఉద్యోగం చేయమంటే చేయడు. యిట్టాగే వుండి పోతాడంట. దేశానికేదో సేవ చేయాలంట' అన్నాడు.

మసక వెలుతురులో బ్రమ్మయ్య మొకం హుసేన్‌కు సరిగా కనబట్టం లేదు.

'హుసేనా! వాణ్ణి చూస్తుంటేనే బయంగా వుందిరా. వాడూ వాడి చేష్టలా. తెల్లారి లేచి యింతెత్తు బొట్టు పెట్టుకొని యింత పొడుగు కఱ్ఱ పట్టుకొని పోతా వుంటాడు. మనకెందుకురా నాయినా అంటే వినడు. ఏందేందో పుస్తకాలు చదవతాడు. యింకేందో మాట్లాడతాడు....'

హుసేన్ బిత్తరపోయి వింటా వున్నాడు.

'వీడు డిగ్రీ చదివేటప్పుడు మేమొక వూర్లో వున్నాం. తిని లక్షణంగా తిరుగుతున్న యీణ్ణి ఆ కాలేజీలో ఎలక్షన్లలో నిలబెట్టినారు. అది జెప్పి యిది జెప్పి నాశినం బట్టించారు. తర్వాత్తర్వాత యిదిగో యిట్టా తయారయ్యాడు. వీడైమైనా బాగపడతాడేమోనని వీడికోసం రిటైర్మెంటు తీసుకొని యీడకొచ్చేస్తే యీడా మొదలెట్టినాడు. మేమున్న వూర్లో ఒకరోజు వీడెనకాల నేనూగూడా పొయ్యా. చాలాసేపు వీళ్ల కత చూశా. మాట్లాడా. నా కొడుకే కాదురా ఆ వూర్లో నా స్నేయితుల పిలకాయలు తెలిసినోళ్ల పిలకాయలు ఎంతమంది వుండారని? కుమ్మరోళ్లు సాకలోళ్లు గొల్లోళ్లు... మాదిగ పిలకాయలు... యీళ్లే ఎక్కువమంది వుండార్రా...'

హుసేన్‌కు దిగిపోతా వుంది.

బ్రమ్మయ్య మాటలు అతణ్ణి కోసేస్తా వున్నాయి.

'రే... వీళ్లంతా యెవురి మీదరా కఱ్ఱ తిప్పుతా వుండారు? నీ మీద నీ భార్య మీద కసాబ్ గల్లీ మీద. అంతేగా? ఏందిరా యీ అన్యాలం' బ్రమ్మయ్య గొంతు బొంగురుపోయింది.

హుసేన్ తెలియకుండానే రెండు కాళ్లూ పైకి మడిచి దగ్గరికి ఒదిగి కూర్చున్నాడు.

'హుసేనా... చెడ్డీలే ఏసుకోబల్లా. టోపీలే పెట్టుకో బల్లా. అయన్నీ లాకుండానే అంతకంటే కచ్చగా కఱ్ఱలు తిప్పడానికి యెంతోమంది తయారవతా వుండార్రా. మన్తో కలిసిమెలిసి వుండేవాళ్లని మన మధ్య అమాయకంగా తిరిగేవాళ్లని యిగ్రహాలనీ వూరేగింపులనీ చెప్పి లాగతుండార్రా... పగ పుట్టిస్తున్నార్రా' అన్నాడు.

ఒక తట్టు అతడా మాటలు అంటానే వున్నాడూ కింద గలాటా మొదలయ్యింది. బ్రమ్మయ్య చప్పున లేచి పిట్టగోడ కాడికిపోయాడు. ఎనకనే వచ్చి హుసేన్ తొంగి చూశాడు.

లోపలికి రాకుండా గేటుకాణ్ణే నిలుచొని కేకలేస్తా ఉండాడు రవణ. సీతమ్మ

యేందో సర్ది చెప్తా వుంది.

'అదేవీ లేదురా రవణ. ముందు నూ లోపలికి పా. రేపు మాట్లాడదాం. నూ రా నాయినా' అంటోంది రవణతో. అతడి పక్కన యింకొకతను నిలబడి వున్నాడు.

'సీతమ్మా! ఏందా గొడవ' అని హూంకరించాడు బ్రమ్మయ్య.

'ఏందా?! నూ కిందకిరా జెప్తా. ఎవుర్నడిగి స్థలం అమ్మకానికి పెట్టినావు. ఏ దెయిర్యంతో చూపించినావు. అదిగూడా సాయిబుకి. సిగ్గు లా?' రొమ్ము ఎగరేస్తా అడిగాడు రవణ.

ఆ మాటకు బ్రమ్మయ్య హుసేన్ వైపు తల తిప్పి కూడా చూళ్లా. దనదనమని మెట్లు దిగి కిందకిబోయాడు.

'యేందిరా కూస్తా వుండావు? ముందు పా. యింట్లోకి' అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

రవణ కదల్లేదు.

బ్రమ్మయ్య తల తిప్పి పక్కనున్నతని వైపు చూశాడు.

'పంతులా! నువ్వు సర్పంచ్‌వైతే గావచ్చుగానీ నా యింటి దెగ్గిర మాత్రం గాండ్ నకరాలు నూకబాక. పో... యీణ్ణుంచి' అన్నాడతడితో.

సర్పంచ్ కిండల్‌గా నవ్వాడు.

'నేనేవి చేశాను బ్రమ్మయ్యా. మీవోడు రమ్మంటేనే వొచ్చా. సందేళ నుంచి బజార్లో నిలబడి ఒకటేమైన గోల చేస్తా వున్నాడు. నువు స్థలం అమ్మబోయే మనిషి కసాయోడంట గదా' అన్నాడతడు.

'అంటగా ఏంది. కసాయోడే. జీవాల్ని నరికే జాతోణ్ణి దెచ్చి మా నాయిన స్థలం అమ్మతా వున్నాడు. యీళ్ళు ముందు జీవాల్ని నరకతారు. తర్వాత మనల్ని నరకతారు. యాడాడి నుంచో వీళ్లొచ్చి చేరేది అందుకేగా?' అన్నాడు రవణ.

బ్రమ్మయ్య మనసులో ముల్లు దిగినట్టయ్యింది.

'యాడాడి నుంచో ఏందిరా? యిది హుసేను పుట్టి పెరిగినూరు. యీడ మనకేనా హక్కా? వాడికి లా? నేనోడికి స్థలం అమ్మేది అమ్మేదే. ఎవురడ్డం వస్తారో చూస్తా' గొంతు పెంచి అన్నాడు బ్రమ్మయ్య.

'ఏమిటా హక్కా? హిందువు కానోడెవ్వడికీ యీడ ఏ వూరు లా. ఏ హక్కూ లా. ముందా ముసలోణ్ణి బయటికి పొమ్మని చెప్పు' అని రంకెవేశాడు రవణ.

బ్రమ్మయ్య సంబాళించుకోలేకపోయాడు. ఎగిసి కొడుకు గుండెల మీద కాలితో ఒక్క తావు తన్నాడు.

'లంజా కొడకా! పోరా బయటికి. పోయి వూరి మీద పడి సావు. మనుషుల్ని నాశినం చెయ్. నా కళ్ల ముందు మాత్రం వుండబాకా' అన్నాడు వూగిపోతా.

అంతదాకా మిద్దె మీంచి చూస్తా వున్న హుసేన్ పరిగెత్తుకుంటా వచ్చి బ్రమ్మయ్య చేతులు పట్టుకున్నాడు.

'రే... బ్రమ్మయ్యా. వొద్దురా. యీ గొడవొద్దు. నాకే స్థలవూ బళ్లేదు. నువ్వమ్మినా కొనను. నా సావు నా వూర్లో జరగాలని యీడకి వచ్చాగానీ గలటాల కోసం గాదురా. బెదిరింపుల బతుకు నేను బతకలేనురా....' అన్నాడు.

అతడి ముసలికళ్లల్లోంచి బొటబొటామని కన్నీళ్లు రాలిపడ్డాయి.

బ్రమ్మయ్య కదిలిపోయాడు.

'హుసేనా. ఆ స్థలం నీది. నీదిగాకపోతే ఎవ్వరిదీ కాదు. ఎవ్వరికీ అమ్మను. అట్టాగే పాడుబెడతా. నూ మాత్రం బాదపడబాక. నేన్జెప్తున్నాగా. యీణ్ణే వుండు. నాకాడే.... రే... ఆగరా... కూడైనా తినిపోరా... రే... హుసేనా' బ్రమ్మయ్య పెద్దగా ఏడస్తా పిలస్తానే వున్నాడు.

హుసేన్ వినిపించుకోలేదు.

అప్పటిగే గేటు దాటేశాడు.

చీకటి మరింత దట్టమై ఆ యింటి మీద నల్లగా కమ్ముకుంది.

ఆదివారం ఆంధ్రజ్యోతి 1998
కథ 1998
Katha Prize Stories-1998